క్లుప్తంగా

ఘనంగా వీరభద్రేశ్వర స్వామి ఉద్భవ దినోత్సవం



వీరభద్రేశ్వర స్వామి విగ్రహంతో పల్లకి సేవ నిర్వహిస్తున్న భక్తులు.

ఆదోని అర్బన్: వీరభద్రేశ్వర స్వామి ఉద్భవ దినోత్సవం సందర్భంగా స్థానిక సంతపేటలో వెలసిన శ్రీ పేట వీరభద్రేశ్వర స్వామి ఆలయంలో స్వామివారికి విశేష పూజలు జరిగాయి. నిర్వాకుడు అల్కూరు మఠం మహర్షి విజయ్ కుమార్ స్వామి ఆధ్వర్యంలో ముందుగా విఘ్నేశ్వర పూజ, కలశపూజ, ఉమామహేశ్వరుల పూజ, ఆదిగురు రేణుకచారుల అభిషేకం, మూలవిరాట్ శ్రీవీరభద్రేశ్వర స్వామికి రుద్రాభిషేకం, స్వామివారి ఉత్సవామూర్తికి పల్లకీ సేవ నిర్వహించారు.

వినాయక ఘాట్ పరిశీలన



ఎల్లెల్సీ వద్ద వినాయక్ ఘాట్‌ను పరిశీలించి సిబ్బందితో మాట్లాడుతున్న కమిషనర్

ఎమ్మిగనూరుటౌన్: వినాయక నిమజ్జన ఏర్పాట్లలో భాగంగా పట్టణ సమీపంలోని తుంగభద్ర దిగువ కాలువ(ఎల్లెల్సీ) వద్ద ఏర్పాటు చేస్తున్న వినాయక ఘాట్ పనులను మంగళవారం మున్సిపల్ కమిషనర్ గంగిరెడ్డి పరిశీలించారు. వినాయకుల నిమజ్జనానికి కావాల్సిన క్రేన్లు, బారికేడ్లు, గజ ఈతగాళ్లు, తీసుకోవాల్సిన రక్షణ చర్యలు తదితర అంశాలపై ఇంజినీరింగ్ అధికారులకు సూచనలిచ్చారు. మున్సిపల్ డీఈ నీరజ పాల్గొన్నారు.

నిక్షయ్ మిత్ర ధ్రువ పత్రాల పంపిణీ



ధ్రువ పత్రాలను అందజేస్తున్న డాక్టర్లు

పెద్దకడబూరు : టీబీ ముక్త్ భారత్ అభియాన్ కార్యక్రమంలో భాగంగా 15 మంది క్షయ వ్యాధి గ్రస్తులకు 5నెలల పాటు నిత్యవసర పోషకాహార కిట్లను ఉచితంగా ఇచ్చిన దాతల (నిక్షయ మిత్రులు)కు ఎంపీటీసీ డాక్టర్ శేఖన్‌భాను, మెడికల్ ఆఫీసర్లు డాక్టర్ ఫిర్దోస్, డాక్టర్ కేజియా, డాక్టర్ రవికుమార్, డాక్టర్ సుష్మిత స్థానిక ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిక్షయ్ మిత్ర ధ్రువ పత్రాలను అందజేశారు. సీహెచ్ఓలు ఆదినారాయణ, శ్రీధర్, సుశీల, హెల్త్ సూపర్‌వైజర్ కిశోర్‌కుమార్, హెచ్‌ఎస్ లక్ష్మినరసమ్మ, ఫ్లోరెన్స్ నైటింగేల్, టీబీ సూపర్‌వైజర్లు బాబు రాజు, భాస్కర పాల్గొన్నారు.

మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయం



థెరిస్సా విగ్రహానికి నివాళులర్పిస్తున్న దృశ్యం

ఎమ్మిగనూరుటౌన్: విశ్వమాతగా పేరున్న మదర్ థెరిస్సా సేవలు చిరస్మరణీయమని ఆమెను ప్రతి ఒక్కరు ఆదర్శంగా తీసుకొని సేవా భావం అలవర్చుకోవాలని వైఎస్సార్‌సీపీ జిల్లా అధికార ప్రతినిధి, వేదాస్ స్వచ్ఛంద సేవాసంస్థ వ్యవస్థాపకుడు సునీల్‌కుమార్ పేర్కొన్నారు. మదర్ థెరిస్సా జయంతిని పురస్కరించుకొని మంగళవారం పట్టణంలోని ఎంబీ చర్చి వద్ద ఆమె విగ్రహానికి పార్టీ చేనేత విభాగం రాష్ట్ర కార్యదర్శి మాచాని వెంకటేష్, సంస్థ సభ్యులు ఎల్‌ఐసీ ప్రభాకర్, నందవరం జెడ్పీటీసీ నిఖిల్ చక్రవర్తి పూలమాల వేసి నివాళులర్పించారు. ముత్తుసుమాల,బుజ్జిబాబు, చిన్న పోతప్ప,శాంతిరాజు పాల్గొన్నారు.

సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడిగా రంగన్న



ఎమ్మిగనూరుటౌన్: సీపీఐ పట్టణ కార్యదర్శిగా పని చేస్తున్న జి.రంగన్న ఆ పార్టీ రాష్ట్ర సమితి సభ్యుడిగా నియామకయ్యారు. ఈ మేరకు ఇటీవల ఒంగోలులో జరిగిన సీపీఐ రాష్ట్ర మహాసభల్లో ఆయనను ఏకగ్రీవంగా ఎన్నుకున్నట్లు ఆ పార్టీ నాయకులు విజయేంద్ర, సమీవుల్లా, తిమ్మగురుడు,వీరేష్ మంగళవారం తెలిపారు. విద్యార్థి ఉద్యమాల నుంచి సీపీఐలో ప్రజా సమస్యల పరిష్కారానికై పోరాటం చేసే ఆయనకు రాష్ట్ర కమిటీలో స్థానం కల్పించడంపై వారు హర్షం వ్యక్తం చేశారు.

అనారోగ్యంతో ఉపాధ్యాయుడి మృతి



నూర్ అహ్మద్ బాషా(ఫైల్)

ఆదోని సెంట్రల్: పట్టణానికి చెందిన ఉపాధ్యాయుడు నూర్ అహ్మద్ బాషా మంగళవారం సాయంత్రం మృతి చెందాడు. మృతుడు మండలంలోని ఆరెకల్లు గ్రామ ప్రాథమిక పాఠశాలలో ప్రధానోపాధ్యాయుడిగా పని చేస్తున్నాడు. అనారోగ్యానికి గురికావడంతో కుటుంబసభ్యులు హైదరాబాద్‌లోని ఆసుపత్రికి తరలించారు. అక్కడ చికిత్స పొందుతూ మృతి చెందాడు. విషయం తెలుసుకొన్న ఎంఈఓలతో పాటు ఉపాధ్యాయులు ఆ కుంటుంబానికి ప్రగాఢ సానుభూతి తెలిపారు.









మట్టి వినాయకులను పంపిణీ చేస్తున్న పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు,సోమప్ప సర్కిల్‌లో గణనాధుడి విగ్రహాలు కొనుగోలు చేస్తున్న భక్తులు, మట్టి విగ్రహాన్ని డీఎస్పీ ఎంఎన్ భార్గవికి అందచేస్తున్న విద్యార్థినులు, అమ్మకానికి సిద్ధంగా అరటి బోదెలు

ఆదిపూజకు వేళాయే!

- నేడు వినాయక చవితి
- వాడవాడలో పండుగ సందడి

ఎమ్మిగనూరుటౌన్: ఆదిపూజకు ఆద్యుడైన వినాయక చవితిని నిర్వహించుకొనేందుకు పూజా సామగ్రి కోసం మంగళవారం పట్టణంలోని సోమప్ప సర్కిల్ కొనుగోలుదారులతో కిటకిటలాడింది. బుధవారం వినాయ చవితిని పురస్కరించుకొని ఇప్పటికే పట్టణంలో దాదాపు 200 విగ్రహాలు ఏర్పాటుకానున్నాయి. మూడు రోజుల పాటు పూజల అనంతరం స్థానిక ఎల్లెల్సీలో నిమజ్జనం చేయనున్నారు.

పూజకు మట్టి విగ్రహాలు ప్రథమం

మంత్రాలయం : శాస్త్రీయంగా మట్టి విగ్రహాలు పూజలకు ప్రథమమని శ్రీమఠం పీఠాధిపతి సుబుధేంద్ర తీర్థులు ప్రవచించారు. వినాయక వేడుకలు సందర్భంగా మంగళవారం స్థానిక ఆంజనేయస్వామి ఆలయంలో మట్టి విగ్రహాల పంపిణీకి ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ముందుగా మట్టి విగ్రహాలకు కుంకుమ, పుష్పార్చనలు గావించి హారతులు పట్టారు. స్వామిజీ మాట్లాడుతూ వినాయక ఉత్సవాల్లో పూజలకు మట్టి విగ్రహాలను వినియోగించడం ఉత్తమమన్నారు. ప్లాస్టిక్, రసాయన ఆధారిత విగ్రహాలను పూర్తిగా విస్మరించాలని సూచించారు. పర్యావరణ పరిరక్షణకు మట్టి విగ్రహాలు అవసరమన్నారు. అనంతరం గ్రామస్తులకు 127 మట్టి విగ్రహాలను వితరణ చేశారు. కార్యక్రమంలో నిర్వాహకులు రాఘవేంద్రగౌడ్, గ్రామస్తులు పాల్గొన్నారు.



ఆదోనిలో వినాయక విగ్రహాలను కొనుగోలు చేస్తున్న నిర్వాహకులు

ఎమ్మిగనూరురూరల్: మట్టి వినాయక విగ్రహాలతో పర్యావరణాన్ని పరిరక్షించుకోవచ్చునని డీఎస్పీ ఎంఎస్ భార్గవి పేర్కొన్నారు. మంగళవారం స్థానిక భాష్యం ఇంగ్లిష్ మీడియం స్కూల్ విద్యార్థులు ప్రిన్సిపాల్ ఎం. కవిత ఆధ్వర్యంలో మట్టితో తయారు చేసిన విగ్రహాన్ని డీఎస్పీకి, తహసీల్దార్ శేషఫణి, డిప్యూటీ తహసీల్దార్లు వీరభద్రగౌడ్, జ్యోతిర్మయిలకు వారి కార్యాలయాల్లో అందజేశారు. అనంతరం విద్యార్థులు తెచ్చిన బిస్కెట్లు, బ్రెడ్లు, పండ్లను ప్రభుత్వాసుపత్రిలో సూపరిండెంట్ డాక్టర్ సుధా ఆధ్వర్యంలో రోగులకు పంపిణీ చేశారు. చాంప్స్ ఇన్‌చార్జ్ అనురాధ, వైస్ ప్రిన్సిపాల్ నాగరాజు పాల్గొన్నారు.



వినాయక చవితి పూజకు పూజా సామగ్రి కొనుగోళ్లతో కిటకిటలాడుతున్న సోమప్ప సర్కిల్



మట్టి విగ్రహాలను అందజేస్తున్న దృశ్యం

ఆదోని సెంట్రల్: బుధవారం వినాయక చవితి పర్వదినం పురస్కరించుకొని బొజ్జ గణపయ్యకు భక్తులు ప్రత్యేక పూజలు చేయనున్నారు. ఇప్పటికే పట్టణ, గ్రామాణ ప్రాంతాల్లో వీధి వీధిన మండపాలు కనిపిస్తున్నాయి. పూజకు అవసరమైన సామగ్రిని కనుగోలుతో మంగళవారం ఉదయం నుంచే భక్తులతో మార్కెట్ కిటకిటలాడింది.

ఆదోని అర్బన్: పట్టణంలోని ఆర్‌ఆర్‌జీ స్వచ్ఛంద సేవా సంస్థ వ్యవస్థాపకుడు తిమ్మనగౌడ వినాయక చవితి సందర్భంగా మంగళవారం మట్టి వినాయక విగ్రహాలను పంపిణీ చేశారు. తన కార్యాలయం వద్ద పట్టణ వాసులకు మట్టి వినాయక విగ్రహాలను అందజేశారు.

పింఛన్ల తొలగింపు దారుణం

ఎమ్మిగనూరుటౌన్: కూటమి ప్రభుత్వం అనర్హత పేరుతో అర్హులైన దివ్యాంగులకు వచ్చే పింఛన్లను తొలగించడం దారుణమని వైఎస్సార్‌సీపీ మేధావుల ఫోరం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కేఆర్ లక్ష్మీకాంతరెడ్డి విమర్శించారు. మంగళవారం పట్టణంలోని తన నివాసంలో పార్టీ నందవరం మండల అధ్యక్షుడు శివప్పగౌడ్,రాష్ట్ర బీసీ సెల్ సంయుక్త కార్యదర్శి విరూపాక్షిరెడ్డి, రైతు విభాగం మండల అధ్యక్షుడు వెంకటేశ్వర్‌రెడ్డి, సీనియర్ నాయకుడు రామ కోటిరెడ్డితో కలిసి విలేకరుల సమావేశంలో మాట్లాడారు. పింఛన్లు తొలగించి దివ్యాంగుల జీవనానికి విఘాతం కల్పించిన ఘనత ఈ ప్రభుత్వానికే దక్కుతుందన్నారు. రాష్ట్రంలో పది వేల మందికి పైగా పింఛన్లు నిలిపివేయడం ఎంతవరకు సమంజసమని ప్రశ్నించారు. పింఛన్లను తగ్గించాలనే ఉద్దేశ్యంతో వికలత్వ శాతాన్ని తగ్గించి చూపుతున్నారని ఆరోపించారు. ఇలా వందలాది మందిని అనర్హులుగా ప్రకటించడం సరికాదన్నారు. గతంలో ఇచ్చిన సదరం సర్టిఫికెట్లలోని వికలత్వం ఇప్పుడెలా తగ్గుతుందని నిలదీశారు. తగ్గడానికి వికలత్వం వ్యాధి కాదని, అవిటితనమని చెప్పారు. ఇలాంటి చర్యలకు ప్రజలు త్వరలో గుణపాఠం చెబుతారన్నారు. అర్హుల పక్షాన వైఎస్సార్‌సీపీ పోరాటం సాగిస్తుందని స్పష్టం చేశారు.



మాట్లాడుతున్న లక్ష్మీకాంతరెడ్డి

యూరియా పకడ్బందీగా పంపిణీ చేయండి

నందవరం : రైతులకు యూరియా పకడ్బందీగా పంపిణీ చేయాలని తహసీల్దార్ శ్రీనివాసులు ఆర్‌ఎస్‌కే సిబ్బందిని ఆదేశించారు. మండలంలోని నాగలదిన్నె, కనకవీడు, పెద్దకొత్తిలి గ్రామాల రైతు సేవా కేంద్రాల్లో ఏఓ సరిత ఆధ్వర్యంలో రైతులకు యూరియాపంపిణీ చేశారు. ఆయన మాట్లాడుతూ కనకవీడు, నాగలదిన్నె, పెద్దకొత్తిలి గ్రామాల ఆర్‌ఎస్‌కేలకు 280 బస్తాల చొప్పున యూరియా వచ్చిందన్నారు.

యువకుడి ఆత్మహత్య



మృతి చెందిన వెంకటరాముడు

మంత్రాలయం రూరల్ : కడుపునొప్పి తాళలేక యువకుడు ఆత్మహత్య చేసుకున్న సంఘటన మంగళవారం మండలంలోని మాధవరం గ్రామంలో చోటుచేసుకుంది. పోలీసుల వివరాల మేరకు.. గ్రామానికి చెందిన లక్ష్మన్న, హనుమంతమ్మకు ఇద్దరు కుమారులు. లక్ష్మన్న 15సంవత్సరాల క్రితం మృతి చెందాడు. పెద్ద కొడుకు వెంకటరాముడు(23) మద్యానికి బానిసయ్యాడు. ఆదివారం పత్తి పంటకు పురుగుమందు పిచికారీ చేయడానికి కూలి వెళ్లాడు. వచ్చి రాత్రి ఇంట్లో అన్నం తిని పడుకున్నాడు. రాత్రి 2.30 గంటల సమయంలో కడుపు నొప్పి ఎక్కువడంతో నొప్పి తాళలేక ఇంట్లో ఉన్న గడ్డి మందు సేవించాడు. కుటుంబ సభ్యులు చికిత్స నిమిత్తం ఎమ్మిగనూరు ఆస్పత్రికి తరలించారు. చికిత్స పొందుతూ మంగళవారం మృతి చెందాడు. మృతుడి తల్లి ఫిర్యాదు మేరకు కేసు నమోదు చేసుకున్నట్లు హెడ్ కానిస్టేబుల్ రాముడు తెలిపాడు.

వినాయక చవితి శుభాకాంక్షలు

మంత్రాలయం: నియోజకవర్గ ప్రజలు వినాయక చవితి పండుగను ప్రశాంత వాతావరణలో భక్తి శ్రద్ధ రుపుకోవాలని ఎమ్మెల్యే బాలనాగిరెడ్డి కోరారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ మండపాల నిర్వాహకులు అధికారుల సూచనలు తప్పకుండా పాటించాలని, జాగ్రత్తగా వ్యవహరించాలని సూచించారు. పండుగ సందర్భంగా ప్రజలకు శుభాకాంక్షలు తెలిపారు. పంటలు సంవృద్ధిగా పండాలని, అన్ని వర్గాల ప్రజలు సుఖశాంతులతో తులతూగాలని ఆకాంక్షించారు.



బాలనాగిరెడ్డి, ఎమ్మెల్యే

ఔట్‌సోర్సింగ్ ఉద్యోగుల సస్పెన్షన్

కౌతాళం : ఉరుకుంద పుణ్యక్షేత్రంలో ఉత్తర ద్వారం ద్ద ఈనెల 23న అమావాస్య రోజున భక్తులపై దాడి చేసిన ఔట్ సోర్సింగ్ ఉద్యోగులను సస్పెండ్ చేసినట్లు డిప్యూటీ కమిషన్ వాణి మంగళవారం తెలిపారు. నరసింహులును సస్పెండ్ చేయగా, ఉశేనిని వారం రోజుల పాటు విధులనుంచి బహిష్కరించామని చెప్పారు. భక్తుల పట్ల మర్యాద పూర్వకంగా నడుచుకోవాలని, వారికి నచ్చజెప్పాలి కానీ, దాడులకు పూనుకోవడం సరికాదన్నారు.



ఖోఖో ఆడుతున్న విద్యార్థులు



పరుగు పందెంలో పాల్గొన్న విద్యార్థినులు

క్రీడలతో మానసికోల్లాసం

ఆదోని సెంట్రల్: చదువుతో పాటు క్రీడలు కూడా చాలా అవసరమని, క్రీడలతో మానసికోల్లాసం కలుగుతుందని పెద్దకడబూరు ఎంఈఓ-2 శ్రీనివాసులు పేర్కొన్నారు. స్థానిక అర్ట్స్ అండ్ సైన్స్ కళాశాలలో జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా వ్యాయమ ఉపాధ్యాయుల అసోసియేషన్ అధ్వర్యంలో మంగళవారం విద్యార్థులకు క్రీడా పోటీలు నిర్వహించారు. వ్యాయమ ఉపాధ్యాయుడు రామన్న మాట్లాడుతూ నియోజకవర్గంలోని వివిధ పాఠశాలల విద్యార్థులు పాల్గొంటున్నారని చెప్పారు. ఇందులో 17 జట్లు బాలురు, 16 జట్లు బాలికలు పాల్గొంటున్నాయని తెలిపారు. గెలుపొందిన జట్లకు 29వ తేదీ జాతీయ క్రీడా దినోత్సవం సందర్భంగా బహుమతులను అందజేస్తామని వివరించారు. వ్యాయమ ఉపాధ్యాయులు కమ్మిరెడ్డి, ఎర్రిస్వామి, నరసింహులు, ఖలీల్ బాషా, కళ్యాణ్, రాము, రాందాసు. శివ, ఓబన్న పాల్గొన్నారు.

బిందేశ్వరి ప్రసాద్ మండల్ జయంతి

ఆదోని టౌన్: ఆదోని డివిజన్ బీసీ ఫెడరేషన్ ఆధ్వర్యంలో మంగళవారం బాబు బిందేశ్వరి ప్రసాద్ మండల్ 107వ జయంతిని స్థానిక కార్యాలయంలో బీసీ ఫెడరేషన్ రాష్ట్ర ఉపాధ్యక్షుడు దస్తగిరినాయుడు ఆధ్వర్యంలో నిర్వహించారు. ముందుగా ఆయన చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. దస్తగిరినాయుడు మాట్లాడుతూ మండల్ ఉత్తర బిహార్‌లోని మాదేపుర నుంచి వచ్చిన ధనిక యాదవ భూస్వామి కుటుంబంలో జన్మించాడన్నారు. బిహార్ రాష్ట్రానికి 7వ ముఖ్యమంత్రిగా పనిచేశారని, అయితే 30 రోజుల తర్వాత రాజీనామా చేశాడన్నారు. వెనుకబడిన తరగతుల కమిషన్‌కు చైర్మన్‌గా పని చేయడంతో మండల్ కమిషన్‌గా పేరుగించిందని గుర్తు చేశారు. డివిజన్ ఉపాధ్యక్షుడు కత్తి హనుమంతరావు, దేవిశెట్టి ప్రకాష్, ధణాపురం శేషన్న, తాలూకా గౌరవ సలహాదారులు బండారి రాజేశ్వరరావు పాల్గొన్నారు.

పద్ధతి మార్పుపై హమాలీల ఆందోళన



మార్కెట్ యార్డులో ధర్నా చేస్తున్న హమలీలు



కమిషన్ ఏజెంట్లు, వ్యాపారులు, హమాలీలతో మాట్లాడుతున్న సీఐ, యార్డ్ సెక్రటరీ కల్పన

ఆదోని అర్బన్: నాలుగు రోజుల నుంచి ఆదోని వ్యవసాయ మార్కెట్ యార్డులో పాసింగ్ వ్యవస్థపై గందరగోళం నెలకొంది. వ్యాపారులు సోమవారం టెండర్ వేసి ఈనామ్ లో ఎంట్రీ చేయకుండా వదిలేశారు. దీంతో రైతులు వేచి చూసి తుదకు యార్డ్ కార్యాలయాన్ని ముట్టడించడంతో సబ్ కలెక్టర్, వన్‌టౌన్ సీఐ శ్రీరాం జోక్యంతో ఆందోళన సద్దుమణిగింది. వ్యాపారులు మాట్లాడుతూ.. ఎమ్మిగనూరు యార్డులో పాసింగ్ లేకుండా మహిళా కూలీలు చాటతోనే నింపుతారని, ఇక్కడ హమలీలు, కూలీలు చాటతో నింపితే తమకు అభ్యంతరం లేదనడంతో సరేనన్నారు. మంగళవారం పాసింగ్ లేకుండా రైతులు తెచ్చిన దిగుబడులను రాసి పోయడంతో వ్యాపారులు టెండర్ ప్రారంభించారు. ఇంతలోనే హమలీలు, మహిళా కూలీలు డబ్బాతోనే నింపుతామని ఆందోళన చేపట్టి కార్యాలయం ఎదుట ధర్నా చేపట్టారు. కమిషన్ ఏజెంట్ అసోసియేషన్ నాయకులు, సీఐ శ్రీరామ్, యార్డ్ సెక్రెటరీ కల్పనతో హమలీలు, కూలీలు చర్చించారు. చివరకు పాత పద్ధతిలోనే (డబ్బాతో నింపడం) దిగుబడులను మంగళవారం సాయంత్రం హమాలీలు కాటా వేశారు. అయితే రెండు రోజుల్లో అధికారులతో చర్చించి నిర్ణయం తీసుకుంటామని యార్డ్ సెక్రెటరీ తెలిపారు. కాగా.. మాకు, వ్యాపారులకు ఎలాంటి సంబంధం లేదని హమాలీలు, కూలీలు నారాయణ, తిమ్మప్ప, రాజు అన్నారు. తమకు గిట్టుబాటు అయితే ధర వేసుకోవాలి కానీ.. ఇలా పద్ధతులు మార్చకూడదని వ్యాపారులపై హమలీలు, మహిళ కూలీలు మండిపడ్డారు.

మదర్ థెరిస్సా జయంతి

మంత్రాలయం రూరల్ : మండల కేంద్రంలో మదర్ థెరిస్సా 115వ జయంతిని నిర్వహించారు. మంగళవారం స్థానిక జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల ఆవరణలో జైభీమ్ ఎంఆర్పీఎస్ ఆధ్వర్యంలో మదర్ థెరిస్సా జయంతి సందర్భంగా ఆమె చిత్రపటానికి సంఘం మండల అధ్యక్షుడు నరసింహులు, హెచ్‌ఎం హంపయ్య పూలమాలలు వేసి నివాళులర్పించారు. వారు మాట్లాడుతూ..మానవసేవే మాధవ సేవయని కుష్టి వ్యాధిగ్రస్తులను, దివ్యాంగులు, అనాథలను చేరదిసి జీవితాన్నే అంకితం చేసిన మహామూర్తి అని కొనియడారు. ఉపాధ్యాయులు విఠోబరావు, రవీంద్ర, సంఘం నాయకులు ప్రకాష్, తిక్కయ్య పాల్గొన్నారు.



మదర్ థెరిస్సా చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పిస్తున్న దృశ్యం

చవితి ఉత్సవాలు ప్రశాంతంగా జరుపుకోండి

మంత్రాలయం రూరల్ : వినాయక చవితి వేడుకలను ప్రశాంతంగా జరుపుకోవాలని సీఐ రామాంజులు సూచించారు. మంగళవారం పట్టణంలోని పోలీస్‌స్టేషన్ ఆవరణలో పీఎస్ కమిటీ సభ్యులతో సమావేశం నిర్వహించారు. ఆయన మాట్లాడుతూ..మండపాల వద్ద జాగ్రత్తలు వహించాలన్నారు. మండపాలకు ముందుగా విద్యుత్ శాఖ అనుమతులు తీసుకోవాలని చెప్పారు. ఎస్ఐ శివాంజల్, పోలీసు సిబ్బంది పాల్గొన్నారు.



మాట్లాడుతున్న సీఐ రామాంజులు

29న జిల్లా స్థాయి జూడో పోటీలు

పెద్దకడబూరు : ఈ నెల 29వ తేదీన జాతీయ క్రీడా దినోత్సవాన్ని పురస్కరించుకొని మండలంలోని కల్లుకుంట గ్రామ జెడ్పీ ఉన్నత పాఠశాల ఆవరణలో జిల్లాస్థాయి జూడో పోటీలు నిర్వహిస్తున్నట్లు పీఈటీ దుబ్బన్న తెలిపారు. ఆయన మాట్లాడుతూ హెచ్‌ఎం సుధాకర్‌బాబు ఆధ్వర్యంలో నిర్వహించే జిల్లాస్థాయి పోటీల్లో ఓపెన్ కేటగిరిలో బాల బాలికలు అందరూ పాల్గొనవచ్చునన్నారు. పోటీలను సీనియర్, జూనియర్, సబ్ జూనియర్‌లుగా నిర్వహించనున్నట్లు పేర్కొన్నారు. పోటీలలో పాల్గొనదలచిన వారు సెల్ 9866621891,80089 08559 సంప్రదించాలన్నారు.

ఆదోనిని జిల్లాగా ఏర్పాటు చేయాలి

ఎమ్మిగనూరుటౌన్: జిల్లాలో వెనుకబడిన పశ్చిమ ప్రాంత అభివృద్ధి కోసం నీరు, ప్రత్యేక నిధులను సమకూర్చి ఆదోనిని ప్రత్యేక జిల్లాగా ఏర్పాటు చేయాలని రాయలసీమ అభ్యుదయ విద్యార్థి ఫెడరేషన్ (ఆర్‌ఏవీఎఫ్) జిల్లా కార్యదర్శి ఖాజ డిమాండ్ చేశారు. మంగళవారం పట్టణంలో ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. కరువు కాటకాలతో గ్రామీణులు వలసలు వెళ్లే మంత్రాలయం, ఎమ్మిగనూరు, ఆలూరు,పత్తికొండ నియోజకవర్గాలతో కలిపి ఆదోని ప్రత్యేక జిల్లాను ఏర్పాటు చేయాలని కోరారు. నాయకులు వీరేష్, మోహన్, రవీంద్రరాజు నాయక్, మహబూబ్ పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ఖాజా

ఎరువుల దుకాణాల తనిఖీ

కోసిగి : స్థానిక ఎరువుల దుకాణాలను ఏఓ వరప్రసాద్, ఎక్సైజ్ ఎస్ఐ కార్తీక్‌సాగర్, ఏఎస్ఐ తిరుపాల్ నాయక్ మంగళవారం అకస్మికంగా తనిఖీ చేశారు. మంజునాథ ట్రేడర్స్, గిరిజ ట్రేడర్స్, వాసవి ఫర్టీలైజర్, హనుమాన్ ఫర్టిలైజర్స్, లక్ష్మినరసింహస్వామి ఎరువుల దుకాణాలలో రికార్డులను, గోడౌన్‌లలోని స్టాక్‌ను పరిశీలించారు. వ్యవసాయ, పోలీస్ సిబ్బంది ఉన్నారు. అధిక ధరలకు విక్రయిస్తే చర్యలు తప్పవని నిర్వాహకులను హెచ్చరించారు.



గోడౌన్‌లో ఎరువుల రికార్డులను పరిశీలిస్తున్న ఏఓ వరప్రసాద్, ఎక్సైజ్, సివిల్ పోలీసులు

మార్కెట్ వేలం వాయిదా

ఆస్పరి: బిల్లేకల్ కూరగాయల మార్కెట్ వేలం వాయిదా పడింది. మంగళవారం మండలంలోని బిల్లేకల్లు గ్రామంలో సర్పంచ్ శ్రీను ఆధ్వర్యంలో 2025- 26 సంవత్సరానికి సంబంధించి పంచాయితీ కార్య దర్శి అంజినయ్య వేలం నిర్వహించారు. వేలంలో స్థానికులు ఐదుగురితో పాటు ఆస్పరి గ్రామానికి చెందిన ఒక్కరు పాటాదారులు రూ.లక్ష సాల్వెన్సి, రూ. లక్ష డిపాజిట్ చెల్లించి పాల్గొన్నారు. అయితే మార్కెట్ వేలంలో స్థానికులే పాల్గొనాలని వేరే గ్రామాలకు చెందిన వ్యక్తులు పాల్గొనకూడదని గ్రామానికి చెందిన మహేష్‌తో పాటు మరి కొందరు అధికారులకు విన్నవించారు. వేలంలో ఎవరైనా పాల్గొన వచ్చని అభ్యంతరం తెలపకూడదని అదే గ్రామానికి చెందిన వెంకటేశ్వర్లు, ఇంకొందరు అధికారులకు చెప్పారు. దీంతో గ్రామస్తుల మధ్య వివాదం నెలకొంది. దీంతో కొద్ది సేపు గ్రామస్తుల వాగ్వాదం చేసుకున్నారు. స్పందించిన ఆస్పరి సీఐ గంగాధర్ రెండు వర్గాలుగా విడిపోయిన గ్రామస్తులను శాంతింపజేశారు. దీంతో వేలంను వాయిదా వేస్తున్నట్లు పంచాయితీ కార్యదర్శి అంజినయ్య ప్రకటించారు. త్వరలోనే మరో తేదీని ప్రకటిస్తామని చెప్పడంతో అందరూ వెళ్లిపోయారు. ఆస్పరి సీఐతో పాటు, ఇద్దరు ఎస్ఐలు, 25 మంది కానిస్టేబుళ్ల బందోబస్తు నిర్వహించారు.

ఉద్యోగులపై వేధింపులు తగదు



మహాధర్నాలో పాల్గొన్న విద్యుత్ శాఖ ఉద్యోగులు

ఎమ్మిగనూరుటౌన్: విద్యుత్ శాఖ ఉద్యోగులు,కార్మికులపై అధికారుల వేధింపులను అరికట్టాలని ఎస్ఈతో పాటు స్థానిక డీఈ నియంతృత్వ ధోరణి మానుకోవాలని ఏపీఎస్పీఈ జాయింట్ యాక్షన్ కమిటీ చైర్మన్ జగదీష్, కన్వీనర్ నాగేషు, నాయకులు పురుషోత్తం రెడ్డి,విజయ్, జయన్న, రత్నంలు డిమాండ్ చేశారు. మంగళవారం స్థానిక విద్యుత్ శాఖ ఈఈ కార్యాలయం ఎదుట సబ్ డివిజన్ ఏపీఎస్పీఈ జేఏసీ ఆధ్వర్యంలో మహాధర్నా నిర్వహించి వంట వార్పు కార్యక్రమం చేపట్టారు. ఇందులో భాగంగా పలు డిమాండ్లతో కూడిన వినతి పత్రాన్ని స్థానిక విద్యుత్ శాఖ కార్యాలయంలో ఇన్‌చార్జ్ డీఈ స్వరూప్‌కుమార్‌కు అందజేశారు. సిబ్బందికి హెచ్‌ఆర్ఏ ,ఇంక్రిమెంట్లు కట్ చేస్తున్నారని ఆరోపించారు. డ్యూటీ పనిష్మెంట్ పేరుతో వేతనాల్లో కోత విధించడం తమను మనోవేదనకు గురిచేస్తోందని ఆవేదన వ్యక్తం చేశారు. ప్రకృతి వైపరిత్యాల వల్ల జరిగే ప్రమాదాలకు లైన్‌మెన్‌లను బలిచేయడం తగదన్నారు. నాయకులు ప్రవీణ్ రుద్రప్ప, సుబ్రహ్మణ్యం,శివ చిరంజీవి,పాండురంగారెడ్డి, భాస్కర్ పాల్గొన్నారు.

సచివాలయ భవనాన్ని అప్పగించండి

హొళగుంద: కోగిలతోట గ్రామంలోని ప్రభుత్వ పాఠశాల ఆవరణలో నిర్మించిన సచివాలయ భవనాన్ని పాఠశాలకు అప్పగించాలని పాఠశాల కమిటీ సభ్యులు, గ్రామస్తులు ఇన్‌చార్జ్ ఎంపీడీఓ చక్రవర్తి, ఎంఈఓలు సుధారాణి, కబీర్‌సాబ్‌ను కోరారు. మంగళవారం వారు హొళగుందలో అధికారులను కలిసి సమస్యను వివరించారు. పాఠశాలకు దాతలు ఇచ్చిన స్థలంలో కొన్నేళ్ల క్రితం సచివాలయ భవనాన్ని నిర్మించారని అప్పట్లో దీనిపై అభ్యంతరాలు వచ్చినా పట్టించుకోలేదన్నారు. 2021లో కోర్టు కూడా భవనాన్ని పాఠశాలకు అప్పగించాలని తీర్పు ఇచ్చినా అధికారులు చర్యలు తీసుకోకపోవడం విచారకరమన్నారు.